క్లుప్తంగా

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఖిలా వరంగల్: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన ఆటో, ట్రాలీ వాహన డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభలో వారు మాట్లాడారు. రవాణా రంగంలో పనిచేస్తు 20 లక్షల మంది పేద బడుగు బలహీన వర్గాల చెందిన కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈనెల 22, 23వ తేదీల్లో కొత్తగూడెంలో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

పరామర్శ



వేలేరు : మండలంలోని సోడాషపల్లి గ్రామానికి చెందిన మెరుగు రమణారెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం అందజేత



దామెర : మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన రెడ్డి సంఘం సీనియర్ నాయకుడు మన్నెం రఘుపతిరెడ్డి తల్లి సూరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా గురువారం రెడ్డి సంఘం నాయకులు సూరమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సాంబశివరెడ్డి, రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, అనంతరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, సమ్మిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఐనవోలు : మండలంలోని ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పున్నేలు గ్రామ పరిధి వడ్డెరగూడెంకు చెందిన ఆలకుంట్ల మధు అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఐనవోలు : మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో 1వ, 2వ, 3వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.3వేలు విలువ చేసే నోట్‌బుక్స్, పలకలను హనుమకొండకు చెందిన దాత శిద్దేశ్వరశర్మ గురువారం అందజేశారు. విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. గురువులు సూచించిన దారిలో నడవాలని, చెడు మార్గంలో పయనించొద్దని అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన హిందీ దివస్ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, కవితలు, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు వేమారెడ్డి, సోమయ్య, వసంత, సుజాత, రజిత, జోసఫిన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందించాలి

కాజీపేట: ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన హామీని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని యువ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు ఆ దిశగా చొరవ తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాజీపేట ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆటో డ్రైవర్ల సమస్యలపై గురువారం చర్చించారు. ఆటో డ్రైవర్లు ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇంగె శ్రీకాంత్, దార సూరి, సార మహేందర్, సాంబరాజు, మంద సతీష్, పరబ్రహ్మచారి, కట్ల శివ, క్యాతం నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

21లోపు అభ్యంతరాలు తెలియజేయాలి

- వివిధ పార్టీల నాయకులతో ఎంపీడీఓల సమావేశం
- ఓటరు జాబితా ప్రదర్శన



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి



కమలాపూర్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు



దామెర : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : గ్రామపంచాయతీల వారీగా తయారు చేసిన ఓటరు జాబితాలో వచ్చిన అభ్యంతరాలను పరిష్కరిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని అభ్యంతరాలు స్వీకరించారు. కాగా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పైడి అచార్య ఆరోపించారు. వార్డులు తారుమారయ్యాయని అన్నారు. ఓటరు జాబితాను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెప్పారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పైడి ఆచార్య, బీఆర్‌ఎస్ నాయకుడు బొల్లోజు కుమారస్వామి, డీఎస్పీ నాయకులు మైదం రవి, షేక్ సలీం పాల్గొన్నారు.

కమలాపూర్ : రెండో సాధారణ గ్రామపంచాయతీ ఓటరు జాబితా ముసాయిదా ప్రకటనపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 21లోపు తెలియజేయాలని ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ సురేష్‌కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెండో సాధారణ గ్రామపంచాయతీ ఓటరు జాబితా ముసాయిదా ప్రకటనపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఓటరు జాబితాను అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీఓ రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నడికూడ : ఓటర్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 21వ తేదీ లోపు తెలిపాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒకే కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండేలా ఓటరు జాబితాను రూపొందించామని అన్నారు. ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దామెర : ఓటరు జాబితాలో తప్పులుంటే సవరిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించారు. వార్డుల వారిగా ఓటరు జాబితాపై చర్చించారు. గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. వార్డుల వారిగా మరోసారి విచారణచేపట్టి త్వరలో తప్పులను సవరిస్తామని అన్నారు. ఎంపీఓ రంగాచారి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి భిక్షపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, సమన్వయ కమిటీ సభ్యుడు మల్లయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు, యువమోర్చా నాయకుడు సూరచందర్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా సంబంధిత గ్రామపంచాయితీ కార్యదర్శికి ఫిర్యాదు అందించాలని ఎంపీడీఓ అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయలకుతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం సూచనలు వారికి వివరించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. మండల పరిషత్ పర్యవేక్షకుడు రామ్‌మోహన్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓలు విజయ్‌కుమార్, వీరేశం గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటర్ లిస్టులో తప్పులు ఉంటే సవరించేందుకు ఈనెల 21 వరకు అవకాశం ఉందని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు.

ఐనవోలు : ఓటరు జాబితా సవరణకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా ముసాయిదాలను వార్డుల వారిగా ప్రదర్శించినట్లు తెలిపారు. సవరణకు ఈనెల 21వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. 17 గ్రామాల్లో 16,736 మంది పురుషులు, 17,370 మంది స్త్రీలు, ఒక్కరు ట్రాన్స్‌జెండర్‌తో కలిపి మొత్తం 34,107 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

'అమ్మ ఆదర్శ' పనుల పరిశీలన



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ అభివృద్ధి పనులను గురువారం టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ డీఈ రవీందర్ సందర్శించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుపగా.. రెండో విడతాలో ఎస్టిమేషన్ వేసి పనులు చేస్తామని ఆయన చెప్పారు. అనంతరం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంజూరు చేసిన ఎస్డీఎఫ్ నిధులు రూ.13 లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. డీఎంఎఫ్‌టీ నుంచి మంజూరైన రూ.3లక్షల 10వేలతో చేపట్టిన పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని అన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో అడవిపందుల స్వైర విహారం



శాయంపేట : చేతికి వచ్చిన పంట చేన్లను అడవిపందులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలారం గ్రామ శివారులో మూడు ఎకరాల 20గుంటల మొక్కజొన్న చేనులో అడవిపందులు స్వైరవిహారం చేశాయని బాధిత రైతు భూతం తిరుపతి వాపోయాడు. సమీప గుట్టల్లో పందులు వందల కొద్ది ఉంటున్నాయని, అడవిపందుల బెడద నుంచి పంటలను కాపాడాలని కోరాడు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని, ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా బాధితుడు కోరాడు.

అలుమ్నీ మీట్ ఇన్విటేషన్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో అలుమ్నీ మీట్‌ను ఈనెల 22న ఉదయం నిర్వహించనున్నారు. ఈమేరకు ది గ్రేట్ రీయూనియన్ పేర నిర్వహించనున్న పొలిటికల్ సైన్స్ విభాగం అలుమ్నీ మీట్‌కు సంబంధించిన ఇన్విటేషన్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం, బీఓఎస్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్, స్కాలర్ కల్లెపెల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీకాంత్

పరకాల : రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో 8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదే విధంగా ఎస్ఎంహెచ్ కళాశాల హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, జిల్లా కమిటీ సభ్యుడు ప్రశాంత్, హేమంత్, ఈశ్వర్ ప్రవళిక, ప్రేమ్, సందీప్, అనూష, శిరీషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిని మార్చారు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం గంటూరుపల్లి గ్రామ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్‌ను విధుల నుంచి తప్పించారు. ఈమేరకు మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కర్నాకర్‌రెడ్డిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గంటూరుపల్లిలో విషజ్వరాలు ప్రబలుతున్నప్పటికీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్.. కనీస చర్యలు చేపట్టలేదనే ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. క్రాంతి కుమార్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు అందాయి. మండల అధికారులు నివేదిక రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించారు.

రేపటి నుంచి ఇంటర్ కాలేజియెట్ టోర్నమెంట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియెట్ మహిళల టోర్నమెంట్ ఈనెల 21న ఉదయం బొల్లికుంటలోని వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ప్రారంభమవుతుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, విశ్వంభర ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

సీపీని కలిసిన ఏసీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్క అందజేశారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

హన్మకొండ: వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హైదర్ సూచించారు. హనుమకొండలోని గాంధీనగర్‌లో లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి ప్రారంభించగా డాక్టర్ హైదర్ మాట్లాడారు. ప్రస్తుతం జ్వరాలు వ్యాప్తి చెందుతున్న క్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

క్రీడామైదానంలో స్వచ్ఛభారత్



శాయంపేట : స్వచ్ఛభారత్‌లో మల్టీపర్పస్ సిబ్బంది



ధర్మసాగర్ : అవగాహన కల్పిస్తున్న అధికారులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాగణంలోని క్రీడామైదానంలో గురువారం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు స్వచ్ఛభారత్ నిర్వహించారు. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను, తుమ్మ చెట్లను తొలిగించారు. ఈ ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ సిబ్బంది చెత్త వేయడంతో బారీగా పేరుకుపోయిందని, విద్యార్థులు వ్యాధుల బారినపడకూడదనే ఉద్దేశంతో శుభ్రం చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ తెలిపారు.

అధికారుల శ్రమదానం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛతహి సేవ కార్యక్రమంలో భాగంగా అధికారులు శ్రమదానం చేశారు. కార్యాలయ ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. డీఆర్‌డీఓ నాగపద్మజ, బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి, చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు దామోదర్, కృషి విజ్ఞాన కేంద్రం, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త అరుణజ్యోతి, శాస్త్రవేత్త గణేశ్, సీడీపీఓ విశ్వజా, ఎంపీడీఓ అనిల్ కుమార్, రామ్‌మోహన్, కార్యాలయ సిబ్బంది, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జాన్సీ, రజిత, బాలల హక్కుల అడ్వైజర్ ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేలేరు : అనారోగ్య సమస్యను భరించలేని యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని కమ్మరిపేటతండలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మరిపేటతండకు చెందిన లావుడ్య తిరుపతి(26) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితియ సంవత్సరం చదువుతున్నాడు. తిరుపతికి కొన్ని సంవత్సరాల కిత్రం బ్రెయిన్ సమస్య రాగా క్రమంగా కంటిచూపు మందగించి రేచీకటితో పాటు ఇతర అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఉండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన తిరుపతి.. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కమ్మరిపేటతండలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కన్నీరు పెట్టించాయి. చిన్న వయస్సులోనే పరలోకాలకు వెళ్లడం బాధకరమని పలువురు విచారణ వ్యక్తం చేశారు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివకాల ప్రకారం.. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బొడిగే చంద్రకాంత్ బుధవారం రాత్రి ఆత్మకూరు నుంచి నల్లబెల్లికి బైక్‌పై వెళ్తుండగా కటాక్షపూర్ సమీపంలో కారు ఢీ కొట్టింది. దీంతో చంద్రకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సీఐ సంతోష్ తెలిపారు.

పరకాలలో మున్సిపల్ ఉద్యోగి..

పరకాల : రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ మహిళ ఉద్యోగి (సిస్టం ఆపరేటర్) గంట స్రవంతి గాయపడ్డారు. ఈ సంఘటన పరకాల కొత్త మున్సిపాలిటీ జంక్షన్‌లో గురువారం చోటుచేసుకుంది. స్రవంతి గర్భిణీ కావడంతో డెలివరీ కోసం సెలవు తీసుకుంది. కార్యాలయంలోని ఉద్యోగులను కలిసి వెళ్లేందుకు ఉదయం 10 గంటలకు వచ్చిన ఆమె.. అనంతరం ఇంటికెళ్లేందుకు కార్యాలయం బయటకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లింది. ఈ క్రమంలో బీసీ కాలని నుంచి మున్సిపాలిటీ వైపు వేగంగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంతో దూసుకొచ్చి ఢీ కొట్టాడు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, మున్సిపల్ ఉద్యోగులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉనికిని కాపాడుకునేందుకే బీఆర్‌ఎస్ ఆరోపణలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో జరిగిన ఘర్షణలో పోలీస్‌లు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అని తేడా లేకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించారని అన్నారు. తప్పు చేసిన కాంగ్రెస్ నాయకులపై కూడా కేసు పెట్టారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పోలీసులపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రమణారెడ్డి అధికారంలో ఉన్న సమయంలో మైలారం గ్రామపంచాయతీలో వినాయకుడిని ప్రతిష్టిస్తే పోలీస్‌లతో లాఠీచార్జీ చేయించిన విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై నిందలు మోపితే సహించేది లేదన్నారు. పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, రవి, కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కృష్ణమూర్తి, రమేశ్, వెంకటరాజిరెడ్డి, కుమారస్వామి, జంగారెడ్డి, రాజ్ కుమార్, భిక్షపతి, ఐలయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లో సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామం గల గ్రామపంచాయతీ కార్యాలయంలో పోషణ మాసాన్ని పురస్కరించుకొని గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషక పదార్థాల ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునిత, మంజుల మాట్లాడుతూ.. గర్భిణులు, తల్లులు, చిన్నారులు ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పాలు, పండ్లు, కూరగాయలతో పాటు చిరుధాన్యాలు, డ్రై ఫ్రూట్స్, మొలకెత్తిన విత్తనాలను భుజించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఆస్పత్రి సమస్యలను పరిష్కరించాలి

- ధర్మసమాజ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్



పట్టణంలోని సివిల్ ఆస్పత్రిని సందర్శిస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

పరకాల : పట్టణంలోని సివిల్ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ డిమాండ్ చేశారు. పార్టీ చేపట్టిన వైద్య, విద్య పరిశీలన కార్యక్రమంలో భాగంగా సివిల్ ఆస్పత్రిని గురువారం సందర్శించినట్లు చెప్పారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం, పారిశుద్ధ్య సిబ్బంది కొరతతో పాటు రోగులకు కావాల్సిన బెడ్లు లేకపోవడం, అత్యవసర వైద్యసేవలు అందడం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహారాజ్, ప్రధాన కార్యదర్శి రవి, సలీం పాషా, రత్నాకర్, తిరుపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సారయ్య

శాయంపేట : ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. కొత్తగట్టుసింగారం, గట్లకానిపర్తి, గోవిందాపూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన సందర్శించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు సెలవు తీసుకోవాల్సి వస్తే ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, సమయపాలన పాటించాలని అన్నారు. విద్యార్థులకు సరియైన క్రమశిక్షణ నేర్పించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. చిన్నతనం నుంచే చదువుపై మక్కువ పెంచుకోవాలని అన్నారు. విద్యార్థుల చదవడం, రాయడం, చతుర్విధ పక్రియలను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీ వంశీ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌లో రెజ్లింగ్‌ను ప్రారంభించండి



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో రెజ్లింగ్ క్రీడాకారుల అడ్మిషన్ల ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ.కరీం కోరారు. ఈమేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డిని హైదరాబాద్‌లోని సాట్ కార్యాలయంలోని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరంలో జిల్లాకు రెజ్లింగ్ అకాడమీకి సాట్ అనుమతి ఇచ్చిందని, అకాడమీలో ఎంపిక ప్రక్రియను సైతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పూర్తి చేసిందని తెలిపారు. మూడు నెలలు గడుస్తున్నా హాస్టల్‌లో వసతి కల్పించకపోవడంతో క్రీడాకారులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.